క్లుప్తంగా

నేటి నుంచి తాగునీటి సరఫరాలో అంతరాయం

పెద్దపల్లిరూరల్: మిషన్ భగీరథ పథకం కింద తాగునీటిని సరఫరా చేసే ప్రధాన పైప్‌లైన్ అంతర్గాం మండలం ముర్మూర్ వద్ద లీకేజీయిన కారణంగా మంగళ, బుధవారాల్లో తాగునీటి సరఫరాకు అంతరాయం కలుగుతుందని పెద్దపల్లి మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్ తెలిపారు.

ప్రభుత్వ భూమి కబ్జాపై చర్యలు తీసుకోవాలి


వినతిపత్రం అందిస్తున్న కాకర్లపల్లి గ్రామస్తులు

మంథని: కాకర్లపల్లి శ్మశానవాటిక పక్కనున్న భూమిని కొంతమంది కబ్జా చేస్తున్నారని గ్రామస్తులు సోమవారం ఆర్డీవో సురేశ్‌కు వినతిపత్రం అందించారు. ప్రభుత్వ భూమి ఎక్కడ ఖాళీ ఉన్నా కొంతమంది ఆక్రమణ చేస్తున్నారని, ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి బూడిద గణేశ్ అన్నారు. బూడిద రవీందర్, బోసెల్లి శంకర్, అల్లం కుమారస్వామి తదితరులున్నారు.

వాహనాల తనిఖీ

ఓదెల: కనగర్తి, గుండ్లపల్లి గ్రామాల్లో పొత్కపల్లి ఎస్సై దికొండ రమేశ్ ఆధ్వర్యంలో సోమవారం వాహనాలను తనిఖీ చేశారు. ఆయా గ్రామాల మీదుగా జమ్మికుంట, సుల్తానాబాద్ ఇరువైపులకు వెళ్లే అనుమతి లేని పలు వాహనాలకు జరిమానా విధించారు.

పశుగ్రాసం వితరణ



రామగిరి: వేములవాడ రాజరాజేశ్వరస్వామి ఆలయ కోడెల కోసం కల్వచర్ల గ్రామానికి చెందిన శీలం సంధ్య–మల్లేశ్‌యాదవ్ దంపతులు పశుగ్రాసం వితరణ చేశారు. తమ వరి పొలం కోసిన తర్వాత సొంత ఖర్చులతో పశుగ్రాసం కట్టించి ట్రాక్టర్ లోడ్ చేసి వేములవాడ గోశాలకు తీసుకెళ్లారు.

చెక్కు అందజేత

ధర్మారం: ఎర్రగుంటపల్లి గ్రామానికి చెందిన దామోరపెల్లి మహేశ్ ప్రమాదవశాత్తు మరణించగా.. మృతుడి భార్య స్రవంతికి సోమవారం తహసీల్దార్ వకీల్ రూ.లక్ష చెక్కు అందించారు. గాయత్రి బ్యాంకులో నిర్భయ సేవింగ్ ఖాతాపై ప్రమాద బీమా ఉండడంతో అందించినట్లు తహసీల్దార్ తెలిపారు.

ఆరోపణలు మానుకోవాలి


మాట్లాడుతున్న నాయకులు

రామగిరి: నిరంతరం రాష్ట్రాభివృద్ధికి పాటుపడే రాష్ట్ర ఐటీ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు కుటుంబంపై మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు ఆరోపణలు మానుకోవాలని కాంగ్రెస్ మండల నాయకులు హితవు పలికారు. సోమవారం సెంటినరికాలనీ శ్రీపాద భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వ మహిళా అధికారిణి అని కూడా చూడకుండా మాట్లాడిన తీరు మీ విజ్ఞతకే వదిలేస్తున్నామన్నారు. నాయకులు బర్ల శ్రీనివాస్, ఆరెల్లి కొంరయ్య, తోట చంద్రయ్య, మైదం వరప్రసాద్, ముస్త్యాల శ్రీనివాస్, మెత్కురి అవినాశ్, దాసరి శివ, బంక్ మల్లేశ్, తాటి సతీశ్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

మంథని: సరస్వతి పుష్కరాలను వైభవంగా నిర్వహిస్తుంటే ఓర్వలేక ప్రభుత్వం, మంత్రి శ్రీధర్‌బాబుపై పుట్ట మధు దుష్ప్రచారం చేస్తున్నారని కాంగ్రెస్ నాయకుడు ఎరుకల ప్రవీణ్, కుడుదుల వెంకన్న, మంథని సురేశ్ అన్నారు. సాదుల శ్రీకాంత్, నాగుల రాజయ్య, ఎరుకల సురేశ్, మేడి శ్రీను, మోహన్, చందు, విజయ్ తదితరులున్నారు.

చదువు ఉద్యోగం కోసమేననే భావన ఉండొద్దు

కరీంనగర్: ఉద్యోగం కోసమే చదువుకుంటున్నామనే భావన యువతలో రావద్దని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ అన్నారు. కరీంనగర్‌లోని బీసీ స్టడీ సర్కిల్‌లో పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులకు సోమవారం శ్రీసేవా మార్గ్ స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకురాలు మునిపల్లి ఫణీత ఆధ్వర్యంలో స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. చదువు మన కాళ్లపై మనం నిలబడేలా చేస్తుందని, సమాజంలో మార్పు తీసుకరావడంలో ముఖ్యపాత్ర పోషిస్తుందని అన్నారు. బీసీ స్టడీ సర్కిల్‌లో అనేక మంది బీదవారే చదువుకుంటున్నారని, రాబోయే రోజుల్లో ఉద్యోగాలు సాధించి రేపటి తరంలో బీదరికం ఉండకూడదనే ఆలోచనలతో ముందుకు సాగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్టడీ సర్కిల్ డైరెక్టర్ రవికుమార్, కూడలి శ్రీనివాస్, లయన్స్ క్లబ్ అఫ్ కరీంనగర్ ప్రెసిడెంట్ ముక్క శరత్, సెక్రటరీ మ్యాడం శివకాంత్, కోశాధికారి బట్టు వినోద్, విద్యార్థులు పాల్గొన్నారు.

వెండి మబ్బుల కనువిందు



కాల్వశ్రీరాంపూర్: మండల కేంద్రంలోని పాండవుల గుట్ట సమీపంలో సోమవారం ఆకాశంలో వెండి మబ్బులు కనువిందు చేశాయి. ఓవైపు వేసవి ఎండలతో సతమతమవుతున్న తరుణంలో పాల కొండల వలె మెరుస్తున్న మబ్బులు ఆహ్లాదాన్ని పంచాయి. ప్రకృతి ప్రేమికులు నింగిలో ఉన్న తెల్లటి మబ్బులను తమ సెల్‌ఫోన్లలో బంధించారు.

హరిత లక్ష్యం ఖరారు

సుల్తానాబాద్: పచ్చదనం వెల్లివిరియాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం పట్టణాలు, గ్రామాల్లో నర్సరీల పెంపకానికి శ్రీకారం చుట్టింది. మొక్కలు నాటితే వాతావరణ కాలుష్యాన్ని నివారించడంతోపాటు సకాలంలో వర్షాలు కురిసి రైతులకు పంట అధికంగా రావడం, చెరువులు, కుంటలు నిండి వ్యవసాయ బావుల్లో సైతం నీరు సమృద్ధిగా ఉంటుంది. నూతనంగా ఏర్పడిన గ్రామ పంచాయతీలతోపాటు అన్ని గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీల్లో నర్సరీలను ఏర్పాటు చేసింది. వేసవి అధికంగా ఉండడంతో నర్సరీల్లో మొక్కలు బతకడానికి పందిళ్లు వేశారు. గ్రామాల్లో ఈజీఎస్ ఫీల్డ్ అసిస్టెంట్లతోపాటు పంచాయతీ కార్యదర్శులు నిర్వహిస్తుండగా.. పట్టణాల్లో మున్సిపల్ కమిషనర్‌తోపాటు సిబ్బంది పర్యవేక్షిస్తున్నారు.

266 నర్సరీలు..

జిల్లాలో 266 గ్రామ పంచాయతీల్లో నర్సరీలున్నాయి. పెద్దపల్లి, సుల్తానాబాద్, మంథని మున్సిపాలిటీల్లో నర్సరీలతోపాటు కార్పొరేషన్‌లోని పలు ప్రాంతాల్లో నర్సరీలున్నాయి. వర్షాకాలం వచ్చేసరికి మొక్కలు నాటుకునేలా పెంచడం వారి కర్తవ్యం. జూలై చివరి నుంచి ఆగస్టు నెలలో అధికారులు, ప్రజాప్రతినిధులు విరివిగా మొక్కలు నాటే అవకాశముంది. జిల్లావ్యాప్తంగా ఏడాదిలో 8లక్షల మొక్కలు నాటాలని లక్ష్యం పెట్టుకున్నారు. గతంలో నాటిన మొక్కలు 80 నుంచి 90 శాతం బతికాయి. నర్సరీల నిర్వహణ మొక్కలు నాటిన నుంచి ఉపాధి హామీ అధికారులు, పంచాయతీ సిబ్బంది పర్యవేక్షిస్తున్నారు.

పువ్వులు, పండ్ల మొక్కలు

నర్సరీల్లో ఎక్కువగా పువ్వులతోపాటు పండ్ల మొక్కలను సైతం పెంచి పంపిణీ చేస్తున్నారు. జామ, నిమ్మ, బొప్పాయి, పలు రకాల పండ్ల మొక్కలతోపాటు పూల మొక్కలు గులాబీ, మందారం, అంటు మొక్కలు పెంపకం చేసి పంపిణీ చేసేందుకు సిద్ధంగా ఉంచారు. వేసవి కాలం కావడంతో నర్సరీలను పర్యవేక్షించాలని ఇటీవల నిర్వహించిన సమావేశంలో అధికారులు సిబ్బందికి సూచించారు.


నర్సరీలో పెంచుతున్న మొక్కలు

ప్రత్యేక అధికారులతో..

స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించకపోవడంతో గ్రామ పంచాయతీలు ప్రత్యేక అధికారులతో కొనసాగుతున్నాయి. ఆర్థిక భారంతో కొట్టుమిట్టాడుతుండగా.. పంచాయతీలకు నర్సరీలు ఏర్పాటు చేసేందుకు అదనపు భారం పడుతోంది. స్థానికంగా ప్రజాప్రతినిధులు లేకపోవడంతో కేంద్ర ప్రభుత్వం నిధుల విడుదలను నిలుపుదల చేసిందని అధికారులు చెబుతున్నారు. మెజార్టీ నర్సరీల్లో షెడ్మెట్లను ఏర్పాటు చేసి నర్సరీలను కాపాడుతున్నారు.

ఖాళీ స్థలాల్లో..

ప్రభుత్వ ఖాళీ స్థలాలు, గీత కార్మిక సంఘాలకు కేటాయించిన స్థలాలతోపాటు పలు రకాల కులాల కమ్యూనిటీ వాళ్ల ముందు కాల్వ గట్లు, చెరువు గుంటల చుట్టుపక్కల మొక్కలు నాటేందుకు స్థలాలను గుర్తిస్తున్నారు. ఎస్సారెస్పీ కాలువలతోపాటు గుట్టల్లో మొక్కలు నాటేందుకు స్థలాల పరిశీలన పూర్తయినట్లు ఈజీఎస్ అధికారులు తెలిపారు.

మండలం	పంచాయతీలు	లక్ష్యం
అంతర్గాం	16	48,000
ధర్మారం	29	87,000
ఎలిగేడు	12	36,000
జూలపల్లి	13	39,000
కమాన్‌పూర్	09	27,000
మంథని	34	1,02,000
ముత్తారం	14	44,000
ఓదెల	22	66,000
పాలకుర్తి	19	57,000
పెద్దపల్లి	30	90,000
రామగిరి	17	51,000
శ్రీరాంపూర్	24	72,000
సుల్తానాబాద్	27	81,000
మొత్తం	266	8,00,000

సంరక్షించాలి



జిల్లాలో మొక్కలు నాటే లక్ష్యం ఇటీవల ఖరారు చేశారు. కొన్ని శాఖలతోపాటు మండలాలవారీగా గ్రామాల్లో నాటే మొక్కల లక్ష్యాన్ని నిర్ధారించారు. నాటడమే కాకుండా సంరక్షించేందుకు స్థానిక ప్రజాప్రతినిధులు, సిబ్బంది ప్రత్యేక చొరవ తీసుకోవాలి.
– కళాందిని, డీఆర్డీవో, పెద్దపల్లి

అభివృద్ధి, ఉపాధి కల్పనే ధ్యేయం: మక్కాన్‌సింగ్

గోదావరిఖని: నియోజకవర్గంలో అభివృద్ధి, ఉపాధి కల్పన దిశగా ముందుకు సాగుతున్నామని ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ పేర్కొన్నారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి శ్రీధర్‌బాబు సహకారంతో ఈ ప్రాంత అభివృద్ధే లక్ష్యంగా ప్రణాళికాబద్ధంగా ముందుకెళ్తున్నామన్నారు. కాంగ్రెస్ నాయకులు బొంతల రాజేశ్, మహంకాళి స్వామి, దీటి బాలరాజు, ముస్తఫా, తిప్పారపు శ్రీనివాస్, కాల్వ లింగస్వామి, పాతిపెల్లి ఎల్లయ్య, పెద్దేల్లి తేజస్విని ప్రకాశ్, అల్లి శంకర్ తదితరులు పాల్గొన్నారు.

పాలకుర్తి: రాష్ట్రంలోని రైతుల సంక్షేమమే ధ్యేయంగా అధికార కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తోందని ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ అన్నారు. పుట్నూర్ గ్రామంలో నిర్వహించిన పచ్చిరొట్టె విత్తనాల పంపిణీ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పుట్నూర్ గ్రామ అధ్యక్షుడు ప్రశాంత్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రామగుండం: పట్టణంలోని జిల్లాపరిషత్ హైస్కూల్ అభివృద్ధికి సింగరేణి షేప్ నిధులు రూ.2కోట్లతో నూతన భవన నిర్మాణాన్ని చేపట్టనున్నామని ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ అన్నారు. సోమవారం హైస్కూల్ ప్రాంగణం ఇంజినీరింగ్ విభాగం అధికారులతో కలిసి సందర్శించారు. మాజీ కార్పొరేటర్లు దీటి బాలరాజు, మహ్మద్ ఉస్మాన్ షరీఫ్, సలీంబేగ్, గౌస్‌బాబా, సంగనవేణి శేఖర్, సింగం కిరణ్‌కుమార్‌గౌడ్ తదితరులున్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఎంఎస్ రాజ్‌ఠాకూర్


గోదావరిఖని: నినాదాలు చేస్తున్న నాయకులు


పెద్దపల్లిరూరల్: నినాదాలు చేస్తున్న నాయకులు


జ్యోతినగర్: జెండా ఆవిష్కరిస్తున్న సీపీఎం నాయకులు

పుచ్చలపల్లి సుందరయ్యకు నివాళి

గోదావరిఖని: పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతిని సోమవారం స్థానిక గంగానగర్ సమీపంలోని మల్లు స్వరాజ్యంకాలనీలో నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. నాయకులు వై.యాకయ్య, క్రాంతి, భాస్కర్, భాగ్యలక్ష్మి, అనూష, సృజన, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

పెద్దపల్లిరూరల్: సుందరయ్య వర్ధంతిని సీపీఎం జిల్లా కార్యదర్శి ముత్యంరావు తదితరులు నిర్వహించారు. కల్లెపల్లి అశోక్, జ్యోతి, సీపెల్లి రవీందర్, శ్రావణ్, కుమ్మరి నవీన్, కృష్ణ తదితరులున్నారు.

జ్యోతినగర్: ఎన్టీపీసీ రామగుండం ఏరియా కమిటీ ఆధ్వర్యంలో అంబేడ్కర్ సెంటర్, రెండో డివిజన్ అన్నపూర్ణకాలనీ, మూడో డివిజన్ ఇందిరమ్మకాలనీ, భగత్‌సింగ్‌కాలనీల్లో జెండాలు ఆవిష్కరించి నివాళి అర్పించారు. నాయకులు మాట్లాడారు.

రామగుండం: తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట సారథి పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతిని సోమవారం రామగుండంలో సీపీఎం నేతలు నిర్వహించారు. పార్టీ కార్యాలయంలో పతాకావిష్కరణ చేసి నివాళి అర్పించారు. ఎం.రామాచారి, భిక్షపతి, గీట్ల లక్ష్మారెడ్డి, గుండు కనకయ్య, మామిడి సతీశ్, రమేశ్, సత్యం తదితరులున్నారు.


రామగుండం: నివాళి అర్పిస్తున్న సీపీఎం ప్రతినిధులు

యువకుడి బలవన్మరణం


సంపత్(ఫైల్)

ధర్మారం: మల్లాపూర్ గ్రామానికి చెందిన దీకొండ సంపత్(25) కడుపునొప్పి బాధ భరించలేక సోమవారం ఇంట్లో చీరతో ఉరేసుకున్నట్లు ఎస్సై లక్ష్మణ్ తెలిపారు. సంపత్ కొంతకాలంగా కడుపునొప్పితోపాటు షుగర్‌తో బాధపడుతున్నాడు. మందులు వాడుతున్నా నయం కాలేదు. జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్య చేసుకున్నట్లు మృతుడి తల్లి సుగుణ పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ఐదుగురిపై కేసు

యైటింక్లయిన్‌కాలనీ: గంజాయి సేవిస్తూ పట్టుబడిన ఐదుగురు వ్యక్తులపై సోమవారం కేసు నమోదు చేసినట్లు గోదావరిఖని టూటౌన్ పోలీసులు తెలిపారు. స్టేషన్ పరిధి యైటింక్లయిన్‌కాలనీకి చెందిన ఐదుగురు వ్యక్తులు సంతోష్‌నగర్ ఏరియాలోని ఓ ఇంట్లో గంజాయి విక్రయిస్తూ సేవిస్తున్నారని సమాచారం మేరకు ఆదివారం అర్ధరాత్రి టూటౌన్ సీఐ ఎస్.ప్రసాద్‌రావు సిబ్బందితో కలిసి తనిఖీ చేశారు. ఇంట్లో 214 గ్రాముల గంజాయి నిల్వ ఉన్నట్లు గుర్తించారు. గంజాయితోపాటు సేవిస్తున్న ఐదుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు.

యువకుడికి జైలు

రామగిరి: అమ్మాయిని వేధించిన కేసులో యువకుడికి న్యాయమూర్తి మూడు నెలల జైలు శిక్ష, రూ.వెయ్యి జరిమానా విధించారు. రామగిరి పోలీస్ స్టేషన్ పరిధిలో 2021లో ఓ మైనర్ అమ్మాయిని జయశంకర్ భూపాల్‌పల్లి జిల్లా చిట్యాల మండలం వెంచెరామి గ్రామానికి చెందిన కొత్తపల్లి రాము(24) వేధిస్తున్నాడని అప్పటి రామగిరి ఎస్సై రవిప్రసాద్ కేసు నమోదు చేశారు. నేరం రుజువు కావడంతో సోమవారం పెద్దపల్లి జిల్లా ఫాస్ట్‌ట్రాక్ కోర్టు జడ్జి కె.సునీత జైలు శిక్ష, జరిమానా విధించారు.

అగ్ని ప్రమాదంలో మోటార్లు, పైపులు దగ్ధం


నాంసానిపల్లెలో కాలుతున్న పైపులు

ఓదెల: నాంసానిపల్లె గ్రామంలో ప్రమాదవశాత్తు నిప్పంటుకోవటంతో రైతుల మోటార్లు, పైపులు దగ్ధమయ్యాయి. విద్యుత్తు తీగలు తగలటంతో నిప్పురవ్వలు ఎగిసిపడి పైపులు కాలి బూడిదయ్యాయి. ముంజాల సదయ్య, శంకర్, నేదురు రమేశ్‌కు చెందిన పైపులు కాలిపోయాయి. ఈత వనం కూడా మంటలకు కాలిపోయిందని గీత కార్మికులు తెలిపారు.

పేకాట రాయుళ్ల అరెస్టు

జ్యోతినగర్: పేకాట ఆడుతున్న ఆరుగురిని ఎన్టీపీసీ పోలీసులు అదుపులోకి తీసుకొని అరెస్టు చేశారు. ఎన్టీపీసీ మేడిపల్లి సెంటర్ పరిధిలో పేకాట ఆడుతున్నారనే సమాచారంతో ఎన్టీపీసీ ఎస్సై టి.ఉదయ్ కిరణ్ తన సిబ్బందితో తనిఖీ చేపట్టారు. బ్యాంక్ ఆఫ్ ఇండియా ఏరియాలో పేకాట ఆడుతున్న ఆరుగురిని అదుపులోకి తీసుకొని రూ.2,390 స్వాధీనం చేసుకున్నారు.

శతాధిక వృద్ధురాలి మృతి


లక్ష్మీనర్సు(ఫైల్)

కోల్‌సిటీ: గోదావరిఖనిలో సుంక లక్ష్మీనర్సు(104) అనే శతాధిక వృద్ధురాలు అనారోగ్యంతో ఆదివారం రాత్రి మృతిచెందింది. స్థానిక కళ్యాణ్‌నగర్‌లో అక్యుపంక్చర్ డాక్టర్‌గా సేవలందిస్తున్న సుంక నారాయణ తల్లి శతాధిక వృద్ధురాలు. విషయం తెలియగానే సోమవారం వృద్ధురాలి పార్థివ దేహాన్ని మాజీ ఎమ్మెల్యే సోమారపు సత్యనారాయణ సందర్శించారు. పూలమాల వేసి నివాళి అర్పించారు. రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ సంతాపం తెలిపి ప్రగాఢ సానుభూతి ప్రకటించారు. తనకు ఓటు హక్కు వచ్చిన దగ్గర్నుంచి ఇటీవల జరిగిన ఎంపీ, ఎమ్మెల్యే ఎన్నికల వరకు తన తల్లి స్వచ్ఛందంగా ఓటు హక్కును వినియోగించుకున్నారని ఆమె కుమారుడు నారాయణ తెలిపారు. కొడుకు, కోడలు నారాయణ–విజయలక్ష్మితోపాటు మనుమలు డాక్టర్ సాగర్, సుచిన్, మనుమరాళ్లు డాక్టర్ శ్వేత, డాక్టర్ సౌమ్య ఉన్నారు.



రామగుండం: అంతర్గాం మండల పరిధిలోని మొగల్‌పహాడ్ గ్రామంలో ఎన్టీపీసీ సీఎస్ఆర్ నిధులతో స్థాపించిన మినరల్ వాటర్ ప్లాంట్ నాలుగేళ్ల క్రితమే మూతపడింది. ఎన్టీపీసీ యాష్ పాండ్‌తో భూగర్భ జలాలు పూర్తిగా కలుషితమై ఉండడంతో నిర్వాసిత గ్రామాలకు రక్షిత జలాలను అందించాలనే ఉద్దేశంతో ఏర్పాటు చేసిన ఆర్వో ప్లాంట్ల నిర్వహణ పంచాయతీకి భారంగా మారడంతో మూతపడింది. దీనిపై ఎన్టీపీసీ స్పందించి ఆర్వో ప్లాంటును తిరిగి పునరుద్ధరించి స్వచ్ఛమైన తాగునీటినందించాలని నిర్వాసిత గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

పరిహారం అందించాలి


ధర్మారం: బాధితులను పరామర్శిస్తున్న మాజీ మంత్రి

ధర్మారం: బొమ్మారెడ్డిపల్లి గ్రామంలో విషాహారం తిని గొర్రెలు మరణించగా.. కలెక్టర్ ప్రత్యేక నిధి నుంచి పరిహారమందించాలని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ కోరారు. గ్రామానికి చెందిన 5 కుటుంబాల గొర్రెలు మరణించగా.. సోమవారం వారి కుటుంబాలను కొప్పుల ఈశ్వర్ పరామర్శించారు. సింగిల్‌విండో చైర్మన్ ముత్యాల బలరాంరెడ్డి, రాసూరి శ్రీధర్, గాగిరెడ్డి వేణుగోపాల్‌రెడ్డి, గడ్డం మహిపాల్‌రెడ్డి, ఎగ్గెల స్వామి, ఆవుల లత, యాదవ సంఘం నాయకులు పాల్గొన్నారు.

పరామర్శ

జూలపల్లి: మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు చందర్ మేనమామ బాలరాజుపల్లెకు చెందిన బండారు మల్లయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. సోమవారం మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ మృతుడి కుటుంబాన్ని పరామర్శించి సానుభూతి తెలిపారు. మాజీ ఎమ్మెల్యే చందర్, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రఘువీర్‌సింగ్, రామగుండం మున్సిపల్ వైస్ చైర్మన్ అభిషేక్ రావు, నాయకులున్నారు.

చదరంగ పోటీల్లో ప్రతిభ


నగదు, షీల్డ్ అందుకుంటున్న విశాల్

ఎలిగేడు: ఈనెల 18న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నెల్లూరు జిల్లా గొలగమూడిలోని ఫన్ పార్క్ కన్వెన్షన్‌లో జరిగిన ఆల్ ఇండియా ఒకరోజు చదరంగం పోటీల్లో ఎలిగేడు మండల కేంద్రానికి చెందిన తాటిపల్లి విశాల్ పాల్గొని ప్రతిభ కనబరిచారు. ఆంధ్రప్రదేశ్ చెస్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి వై.సుమన్ ఫన్ పార్క్ ఎండీ పాత్తూరి సాయి చేతుల మీదుగా నగదు బహుమతి, షీల్డ్‌తోపాటు సర్టిఫికెట్‌ను అందజేశారు.

పోటీ పరీక్షల పుస్తకాలు అందజేత

సుల్తానాబాద్: మండల కేంద్రంలో ఉన్న లైబ్రరీకి టీటీఆర్ ఫౌండేషన్ అధ్యక్షుడు, ప్రభుత్వ ఉపాధ్యాయుడు తానిపర్తి తిరుపతిరావు రూ.50వేల విలువ చేసే పుస్తకాలను అందజేయడం అభినందనీయమని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతటి అన్నయ్యగౌడ్ అన్నారు. సోమవారం గ్రంథాలయంలో పుస్తకాలను అందజేసిన సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. తానిపర్తి తిరుపతిరావు మాట్లాడుతూ.. సుల్తానాబాద్ లైబ్రరీకి ఎంతో చరిత్ర ఉందన్నారు. కాసర్ల మధుసూదన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి ఆకారి రాజేశం, సంయుక్త కార్యదర్శి ముంజాల హరికృష్ణగౌడ్, వేముల కిరణ్‌గౌడ్, పురం రమణ తదితరులు పాల్గొన్నారు.

రాయితీపై పచ్చిరొట్ట విత్తనాలు

కాల్వశ్రీరాంపూర్: వానాకాలం పంట కాలానికి ముందస్తు సాగు కోసం రాయితీపై పచ్చిరొట్ట విత్తనాలు అందుబాటులో ఉన్నట్లు పీఏసీఎస్, వ్యవసాయ శాఖ అధికారులు ఏవో నాగార్జున, సీఈవో శ్రీనివాస్ తెలిపారు. భూమిలో సారాన్ని పెంచేందుకు ఉపయోగపడే జీలుగ పచ్చిరొట్ట విత్తనాలు కావాల్సిన రైతులు తమ భూమి పాసు పుస్తకం, ఆధార్ జిరాక్స్, ఫోన్ నంబర్లతో తమ కార్యాలయాల్లో సంప్రదించాలని సూచించారు. అపరాల సాగు కోసం పెసర విత్తనాలు అందుబాటులో ఉన్నాయని సీఈవో శ్రీనివాస్ తెలిపారు.

ధ్వజస్తంభ, శిఖర గోపుర ప్రతిష్ఠ


ధ్వజస్తంభ ప్రతిష్ఠ వేడుకల్లో ఎమ్మెల్యే సతీమణి

రామగుండం: అంతర్గాం మండల పరిధిలోని ముర్మూర్ గ్రామ శ్రీపాతాళేశ్వరస్వామి దేవాలయంలో సోమవారం ధ్వజస్తంభ, శిఖర గోపుర ప్రతిష్ఠ వేడుకలు వైభవంగా నిర్వహించారు. రెండు రోజులుగా ప్రతిష్ఠ విశిష్ట క్రతువు పూజలు నిర్వహిస్తుండగా.. సోమవారంతో వేడుకలకు ముగింపు పలికారు. రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ ఠాకూర్ సతీమణి మనాలి ఠాకూర్ హాజరయ్యారు.

హనుమాన్ స్వాములకు పండ్లు పంపిణీ



సుల్తానాబాద్: హనుమాన్ స్వాములకు సేవ గొప్ప విషయమని రిటైర్డ్ హెచ్ఎం అల్లం భాగ్యలక్ష్మి–సత్యనారాయణ అన్నారు. పట్టణ శివారులో రహదారి వెంట పాదయాత్రగా వెళ్తున్న స్వాములందరికీ పండ్లు, వాటర్ బాటిళ్లు, చల్ల ప్యాకెట్లను అందజేశారు. పెద్దపల్లితోపాటు మంచిర్యాల, భూపాల్‌పల్లి ప్రాంతాల నుంచి సుల్తానాబాద్ మీదుగా కొండగట్టుకు రాజీవ్ రహదారిపై వెళ్లే భక్తులందరికీ అందజేస్తామన్నారు. ఈనెల 22 వరకు శిబిరం అందుబాటులో ఉంటుందని వివరించారు.

రాజరాజేశ్వరస్వామి ఆలయంలో రుద్రాభిషేకం


ఆలయంలో అన్నదానం

జూలపల్లి: మండల కేంద్రంలోని శ్రీరాజరాజేశ్వర స్వామి ఆలయంలో సోమవారం ఉదయం రుద్రాభిషేకం పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకుడు ఉద్దండ నవీన్ స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేసి ఆశీర్వదించారు. కరీంనగర్ డెయిరీ డిస్ట్రిబ్యూటర్ బాలాజీ సింగ్ అన్నదానం చేశారు. ఆలయ పునర్నిర్మాణ దాత, నల్ల ఫౌండేషన్ వ్యవస్థాపకుడు నల్ల మనోహర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ పాటకుల అనిల్, ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు పొట్టాల మల్లేశం, దేవసాని శంకరయ్య, వెంకటరమణ, గోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

హనుమాన్ శోభాయాత్ర

కమాన్‌పూర్: మండల కేంద్రంతోపాటు గుండారంలో సోమవారం హనుమాన్ సేవా సమితి ఆధ్వర్యంలో హనుమాన్ శోభాయాత్ర నిర్వహించారు. స్వాములు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.